సాక్షి రాజన్న సిరిసిల్ల

గురువారం । 6 । జూలై । 2023



మిడ్‌మానేరులో 17 టీఎంసీలు

బోయినపల్లి(చొప్పదండి): మిడ్‌మానేరులో 17.51 టీఎంసీలకు నీటిమట్టం చేరింది. ఎల్‌ఎండీలోకి బుధవారం 265 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.



సాయి చైర్మన్‌ను..

సిరిసిల్లఅర్బన్: రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ ఆంజనేయులుగౌడ్‌ను జిల్లా క్రీడాధికారి అజ్మీర రాందాస్, వాలీబాల్ అసోసియేషన్ సభ్యుడు శ్రీకుమార్ బుధవారం కలిశారు.

గరిష్టం/కనిష్టం
32.0/26.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. గాలులు వేగంగా వీస్తాయి.

పోడు పండుగ

- సిరిసిల్లలో నేడు గిరిజనులకు పోడుపట్టాల పంపిణీ
- జిల్లాలో 1,614 కుటుంబాలకు 2,858.34 ఎకరాలు
- మంత్రులు కేటీఆర్, కొప్పుల ఈశ్వర్ చేతుల మీదుగా అందజేత
- పెండింగ్‌లో గిరిజనేతరుల దరఖాస్తులు



రంగంపేట శివారులో పోడు భూమి.

సిరిసిల్ల: అడవులపై ఆధారపడి.. అటవీ ఉత్పత్తులు సేకరిస్తూ.. జీవించే గిరిజనుల పోడుభూములకు పట్టాలు దరి చేరుతున్నాయి. ఏళ్లుగా పట్టాలు లేకుండా.. హక్కులు లేకుండా.. భూములను దున్నుకున్న గిరిజనులకు చట్టబద్ధమైన హక్కులు దక్కుతున్నాయి. జిల్లాలోని ఆరు మండలాల అటవీ గ్రామాల్లోని 1,614 కుటుంబాలకు 2,858.34 ఎకరాల పోడు భూములను రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్ మంత్రి కె.తారక రామారావు, రాష్ట్ర మంత్రి కొప్పుల ఈశ్వర్ గురువారం పంపిణీ చేయనున్నారు. సిరిసిల్లలోని పద్మనాయక కల్యాణ మండపంలో పోడుభూముల పట్టాల పంపిణీ జరుగుతుంది. జిల్లాలోని గిరిజనులకు పోడు పట్టాలు అందుతుండగా.. గిరిజనేతరుల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.

అటవీ హక్కుల దరఖాస్తుల స్వరూపం

అటవీ ప్రభావిత మండలాలు	: 8
అటవీప్రాంత గ్రామాలు	: 67
అటవీ విస్తీర్ణం	:96,394 ఎకరాలు
గిరిజన తండాలు	: 62
గిరిజన జనాభా	: 25,715
దరఖాస్తులు	: 5,939
అటవీ భూములు	:14,031.23 ఎకరాలు
దరఖాస్తు చేసిన గిరిజనులు	: 2,842
భూములు	:7,785.31 ఎకరాలు
గిరిజనేతరుల దరఖాస్తులు	: 3,097
భూములు	:6245.32 ఎకరాలు

67 గ్రామాల్లో అటవీ భూములు

రాజన్న సిరిసిల్ల జిల్లాలో మొత్తంగా 4,72,329 ఎకరాల భూములు ఉన్నాయి. ఇందులో 96,394 ఎకరాల్లో అడవులు విస్తరించి ఉన్నాయి. జిల్లాలోని 8 మండలాల్లో 67 గ్రామాల్లో అటవీ భూములు ఉన్నాయి. 2021 నవంబరు 8 నుంచి 20వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా 5,939 దరఖాస్తులు వచ్చాయి. క్షేత్రస్థాయిలో సర్పంచ్ అధ్యక్షతన, పంచాయతీ కార్యదర్శి, రెవెన్యూ సహాయకులు, అటవీశాఖ బీట్ ఆఫీసర్లు సంయుక్తంగా దరఖాస్తులు స్వీకరించారు. ఆ దరఖాస్తులను ఎంపీడీవోల ద్వారా కలెక్టర్ లాగిన్ నుంచి ఆన్‌లైన్‌లో నమోదుచేశారు. ఆన్‌లైన్ దరఖాస్తులను ఉపగ్రహ చాయా చిత్రాలను జతచేశారు. మొత్తం 5,939 దరఖాస్తుల్లో గిరిజనులకు సంబంధించిన 1,614 పట్టాలను 2,858.34 ఎకరాలను మంత్రుల చేతుల మీదుగా పంపిణీ చేస్తున్నారు.

చందుర్తిలో ఒక్క ఊరు.. వీర్నపల్లిలో 15 గ్రామాలు

పోడు భూముల పట్టాల పంపిణీలో చందుర్తి మండలంలోని దేవునితండాలో 119 మంది గిరిజనులకు పాస్‌పుస్తకాలను జారీ చేస్తుండగా.. వీర్నపల్లి మండలంలో అత్యధికంగా 15 గ్రామాల్లో 776 మందికి పోడు భూములకు పట్టాలు పంపిణీ చేస్తున్నారు. గంభీరావుపేట మండలంలోని జగదాంబతండాలోనూ 40 మందికి, రుద్రంగి మండలంలో 309 మందికి, ఎల్లారెడ్డిపేటలో 64 మందికి, కోనరావుపేట మండలంలో 306 మందికి పాస్‌బుక్కులు ఇవ్వనున్నారు.

భూసర్వేల తీరిది

2005 డిసెంబరు 13వ తేదీ నాటికి అటవీ భూములను సాగుచేసుకున్న వారికి మాత్రమే హక్కులు కల్పిస్తున్నారు. దరఖాస్తుదారుల అర్జీల ఆధారంగా క్షేత్రస్థాయిలో సర్వేయర్‌తోపాటు రెవెన్యూ, అటవీశాఖ అధికారులు సంయుక్తంగా సర్వే చేశారు. ఆ భూములను అక్షాంశ, రేఖాంశాల ఆధారంగా జియోట్యాగింగ్ చేసి.. ఆ చిత్రాలను కార్టోశాట్ (ఉపగ్రహ) మ్యాప్‌తో పరిశీలించారు. భూమి హద్దులను నిర్ణయించి 2005 డిసెంబరు కంటే ముందు మ్యాప్‌లతో పోల్చి చూసి పట్టాల పంపిణీకి సిద్ధం చేశారు. జిల్లాలో ఇంకా 4,325 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వాటికి సంబంధించిన గిరిజనేతరులు 11,216 ఎకరాల్లో పట్టాల కోసం నిరీక్షిస్తున్నారు.

హక్కులతో తొలగనున్న చిక్కులు

జిల్లాలో ఎప్పటి నుంచో అటవీ భూములను దున్నుకుంటూ.. ఫలసాయాన్ని పొందుతున్న గిరిజనులు, గిరిజనేతులు ఆ భూములపై హక్కులు లేక ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరంగా ఉన్నారు. ఆ భూములపై హక్కులుంటే బ్యాంకుల ద్వారా పంట రుణాలు, రైతుబంధు వంటి సాయం పొందే వీలుంది. కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారితో ప్రభుత్వం కల్పించిన అవకాశంతో ఆశలు చిగురించాయి. 2018లో మంత్రి కేటీఆర్ చొరవతో రంగంపేట శివారులో 300 ఎకరాలను 117 మందికి పట్టాలు ఇచ్చారు.

పట్టాలు సిద్ధం



గ్రామసభల ద్వారా వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేశాం. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు పోడుభూములకు పట్టాలను సిద్ధం చేశారు. జిల్లాలో 1,614 గిరిజన కుటుంబాలకు 2,858.34 ఎకరాల భూములను పంపిణీ చేస్తున్నాం. గిరిజనేతరుల పోడు భూములకు పట్టాలు ఇవ్వడం లేదు.

– బి.గౌతమ్‌రెడ్డి, జెడ్పీ సీఈవో, సిరిసిల్ల

నేడు జిల్లాలో మంత్రుల పర్యటన



మంత్రి కేటీఆర్



కొప్పుల ఈశ్వర్

జిల్లాలో గురువారం రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్ శాఖ మంత్రి కె.తారక రామారావు, రాష్ట్ర ఎస్సీ, గిరిజన, బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖల మంత్రి కొప్పుల ఈశ్వర్ పర్యటిస్తున్నారని మంత్రి వ్యక్తిగత కార్యదర్శి కుంబాల మహేందర్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఉదయం 11 గంటలకు తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల వ్యవసాయ కళాశాలలో బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించి, నివాళి అర్పిస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు కలెక్టరేట్‌లో 124 మంది ఎస్సీ లబ్ధిదారులకు చిన్నతరహా కుటీర వ్యాపారం చేసుకునేందుకు రూ.62 లక్షల ఆర్థికసాయాన్ని పంపిణీ చేస్తారు. 12.30 గంటలకు సిరిసిల్ల పద్మనాయక కల్యాణ మండపంలో 1,614 మంది గిరిజనులకు పోడుభూముల పట్టాలను పంపిణీ చేసి, వారితో సహపంక్తి భోజనం చేస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు బీఆర్‌ఎస్‌వీ యూత్ అధ్యక్షుడు సుంకపాక మనోజ్ తండ్రి ఇటీవల మరణించగా.. బోయినపల్లి మండలం విలాసాగర్‌లో వారి కుటుంబాన్ని పరామర్శిస్తారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి



ర్యాలీలో ఎస్పీ అఖిల్‌మహాజన్, బలగం సినిమా నటీనటులు, విద్యార్థులు

- ఎస్పీ అఖిల్‌మహాజన్
- జిల్లాలో 'యాంటీ డ్రగ్స్ కమిటీలు'
- ప్రారంభానికి హాజరైన బలగం టీం

సిరిసిల్లక్రైం: యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని ఎస్పీ అఖిల్ మహాజన్ కోరారు. ఈ లక్ష్యంతో జిల్లాలోని అన్ని విద్యాలయాల్లో యాంటీ డ్రగ్స్ కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో బుధవారం సిరిసిల్లలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొని మాట్లాడారు. జిల్లాలో మాదకద్రవ్యాల నిర్మూలనే లక్ష్యంగా జిల్లా పోలీసులు పనిచేస్తున్నారన్నారు. గత ఆరు నెలల్లో 17 కేసులు నమోదు చేసి 55 మందిని అరెస్ట్ చేసినట్లు చెప్పారు. గంజాయికి సంబంధించి ఎలాంటి సమాచారం ఉన్న డయల్ 100కి తెలపాలని కోరారు. అడిషనల్ కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ తల్లిదండ్రులు, టీచర్స్ ఎప్పటికప్పుడు పిల్లల ప్రవర్తన గమనించాలని కోరారు. బలగం సినిమా దర్శకుడు వేణు మాట్లాడుతూ జీవితంలో ఉన్నత స్థానంలో ఉండాలంటే మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. సినీనటుడు ప్రియదర్శి మాట్లాడుతూ మాదక ద్రవ్యాలను అరికట్టడంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని కోరారు. తాను గతంలో సిగరెట్లు తాగేవాడినని.. వాటితో కలిగిన దుష్ప్రభావాలతో మానేసినట్లు తెలిపారు. సినీ నటి కావ్య మాట్లాడుతూ పోలీసులు సమాజ మంచి కోసం ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. ఏఎస్పీ చంద్ర య్య, జిల్లా విద్యాశాఖ అధికారి రమేశ్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థిని ఆత్మహత్య కారకులను శిక్షించండి



ధర్నా చేస్తున్న విద్యార్థిని బంధువులు

ముస్తాబాద్(సిరిసిల్ల): విద్యార్థిని ఆత్మహత్యకు గల కారకులను శిక్షించాలని కోరుతూ బుధవారం రజకులు ఆందోళన చేపట్టారు. మండలంలోని గూడెంలో పదోతరగతి విద్యార్థిని ఆత్మహత్యకు ఓ యువకుడు, ఓ మాజీ ప్రజాప్రతినిధి కారణమంటూ బైఠాయించారు. వారు మాట్లాడుతూ విద్యార్థినికి ఫోన్‌లో మెసేజీలు పెట్టారని, అందుకు గల కారకుడైన యువకుడిని శిక్షించాలని కోరారు. ఓ మాజీ ప్రజాప్రతినిధి సదరు యువకుడికి వత్తాసు పలుకుతున్నాడని ఆరోపించారు. ఇద్దరిపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరారు. సీఐ ఉపేందర్, ఎస్సై వెంకటేశ్వర్లు గూడెంకు చేరుకొని విద్యార్థి బంధువులను శాంతింపజేశారు. ఇద్దరిపై కేసులు నమోదైన తర్వాతే ఆందోళన విరమిస్తామని పట్టుబట్టారు. కేసు నమోదు చేసి చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని సీఐ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.



ఘనంగా ఆలయ ఉద్యోగుల బోనాలు

వేములవాడ: రాజన్న ఆలయ ఉద్యోగులు బుధవారం పోచమ్మకు బోనం మొక్కులు చెల్లించుకున్నారు. ఉప్పుగడ్డవీధిలోని యూనియన్ భవనం నుంచి బోనాలతో తరలివచ్చారు. ఆదిలాబాద్‌కు చెందిన కళాకారులు చేసిన డప్పు విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి యాదగిరి, కొండగట్టు ఆలయాల ఉద్యోగులు హాజరయ్యారు. ఈవో కృష్ణప్రసాద్, ఏఈవోలు హరికిషన్, ప్రతాప నవీన్, శ్రీనివాస్, జయకుమారి పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

జిల్లాలో మోస్తరు వర్షం



సిరిసిల్ల గాంధీచౌక్‌లో కురుస్తున్న వర్షం

సిరిసిల్ల: జిల్లాలో బుధవారం మోస్తరు వర్షం కురిసింది. ఈ సీజన్‌లో ఇదే భారీ వర్షం. గంభీరావుపేటలో అత్యధికంగా 87.6 మిల్లీమీటర్లు, అత్యల్పంగా సిరిసిల్లలో 9.1 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. రుద్రంగిలో 19.8, చందుర్తిలో 22.3, వేములవాడరూరల్‌లో 48.5, వేములవాడలో 49.4, బోయినపల్లిలో 15.3, కోనరావుపేటలో 9.6, వీర్నపల్లిలో 36.1, ఎల్లారెడ్డిపేటలో 39.5, ముస్తాబాద్‌లో 54.3, తంగళ్లపల్లిలో 14.4, ఇల్లంతకుంటలో 19.6 మిల్లీ మీటర్ల వర్షం కురిసినట్లు సీపీవో పీ.బి.శ్రీనివాస్ తెలిపారు. జిల్లాలో జూలై 5న సగటు వర్షపాతం 6.1 మిల్లీమీటర్లు కాగా.. 32.7 మిల్లీమీటర్లు కురిసింది. అయినా 51 శాతం లోటు వర్షాలు ఉన్నాయి.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఆకునూరి శంకరయ్య

కోనరావుపేట(వేములవాడ): మండల కేంద్రాల్లో ఏర్పాటు చేస్తున్న గ్రంథాలయాలను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆకునూరి శంకరయ్య కోరారు. కోనరావుపేటలోని పౌరపఠనాలయాన్ని బుధవారం సందర్శించారు. శంకరయ్య మాట్లాడుతూ జిల్లాలోని 13 మండలాల్లో పౌర పఠనకేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వేములవాడలో రూ.1.10కోట్లతో గ్రంథాలయ భవనం నిర్మిస్తున్నామని, రుద్రంగి, కోనరావుపేట, ముస్తాబాద్‌లో సొంత భవనాలకు ప్రతిపాదనలు పంపించినట్లు తెలిపారు. ఎంపీడీవో రామకృష్ణ, ఎంపీటీసీ నర్సింహాచారి ఉన్నారు.

కార్మికులు త్రిఫ్ట్ పథకంలో చేరండి

సిరిసిల్ల/సిరిసిల్లకల్చరల్: నేతన్నకు చేయూత పథకంలో చేరని కార్మికులకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. నేతకార్మికులు, మరమగ్గాల కార్మికులతోపాటు అనుబంధ రంగాల కార్మికులు త్రిఫ్ట్ పథకంలో చేరాలని టెక్స్‌టైల్, జౌళి శాఖ అదనపు సంచాలకుడు సాగర్ కోరారు. గతేడాదిలో నమోదుకాని కార్మికులు ఈనెల 15లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పథకంలో చేరిన కార్మికులు ఏ కారణం చేతనైనా మరణిస్తే కుటుంబానికి రూ.5లక్షల ప్రమాద బీమా సొమ్ము అందుతుందని తెలిపారు. వివరాల కోసం జౌళి శాఖ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

రాష్ట్ర స్థాయికి ఎంపికవడం అభినందనీయం



విద్యార్థులను అభినందిస్తున్న సత్యప్రసాద్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని దుమాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీలకు ఎంపికవడంపై అదనపు కలెక్టర్ సత్యప్రసాద్ అభినందించారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన ఫైనాన్స్ లిటరసీ క్విజ్ పోటీలలో పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎస్.ఐశ్వర్య, ఆర్.అభిషేక్ రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. వీరిని అదనపు కలెక్టర్ సత్యప్రసాద్ బుధవారం అభినందించారు. డీఈవో రమేశ్‌కుమార్, సర్పంచ్ కదిరె రజిత, వైస్ ఎంపీపీ కదిరె భాస్కర్‌గౌడ్, ఏఎంసీ మాజీ చైర్మన్ గుల్లపల్లి నర్సింహారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు



ల్యాబ్ టెక్నీషియన్‌ను సన్మానిస్తున్న వైద్యులు

చందుర్తి(వేములవాడ): అంకితభావంతో పనిచేసే వారికి ప్రజల్లో గుర్తింపు ఉంటుందని డీఎంహెచ్‌వో సుమన్ మోహన్‌రావు పేర్కొన్నారు. చందుర్తి పీహెచ్‌సీలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేసి బదిలీపై వెళ్తున్న రాజమణికి బుధవారం వీడ్కోలు సన్మానం నిర్వహించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ పదేళ్లుగా ఇక్కడ విధులు నిర్వర్తించిన ల్యాబ్ టెక్నీషియన్ కరోనా కాలంలోనూ సేలందించిందని కొనియాడారు.

క్రీడలకు పెద్దపీట

- బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు చక్రపాణి
- డిస్ట్రిక్ట్ టోర్నమెంట్ ప్రారంభం



టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న జిందం చక్రపాణి

సిరిసిల్లటౌన్: క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి పేర్కొన్నారు. సిరిసిల్ల ప్రభుత్వ కళాశాల మైదానంలో బుధవారం డిస్ట్రిక్ట్ ప్రీమియం లీగ్ –2023 క్రికెట్ టోర్నీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. జిల్లా నుంచి అనేక మంది క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణిస్తున్నారన్నారు. విద్యార్థులు చదువులతోపాటు క్రీడల్లో రాణించాలని కోరారు. కౌన్సిలర్లు గెంట్యాల శ్రీనివాస్, భూక్యా రెడ్యానాయక్, అన్నారం శ్రీనివాస్, గుడ్ల శ్రీనివాస్, డాక్టర్ సురేంద్రబాబు, అడ్డగట్ల మురళి తదితరులు పాల్గొన్నారు.

మూలవాగు సుందరీకరణ పూర్తి చేయండి

- కలెక్టర్ అనురాగ్ జయంతి
- వేములవాడ అభివృద్ధి పనులపై సమీక్ష



సిరిసిల్ల పద్మనాయక కల్యాణ మండపంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీలు

సిరిసిల్ల: వేములవాడలోని మూలవాగు సుందరీకరణ పనులు వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో వేములవాడ పట్టణాభివృద్ధి పనులపై బుధవారం సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ మల్లారం మార్గంలో నిర్మిస్తున్న వాకింగ్‌ట్రాక్ పూర్తి చేయాలని, ల్యాండ్ పూలింగ్‌లో లే అవుట్ అభివృద్ధి పనులు నెలాఖరులోగా పూర్తి చేయాలని సూచించారు. బయోగ్యాస్ ఎలక్ట్రికల్ జనరేషన్ ప్లాంట్‌ను ప్రారంభించాలని, గుడిచెరువు సుందరీకరణ, ఆలయ అభివృద్ధి పనులను పూర్తి చేయాలన్నారు. ఆలయ ఈవో కృష్ణప్రసాద్, పబ్లిక్ హెల్త్ ఈఈ సంపత్‌రావు, మున్సిపల్ కమిషనర్ అన్వేశ్, ఆలయ ఈఈ రాజేశ్, పబ్లిక్ హెల్త్ డీఈఈ తిరుపతి, మున్సిపల్ ఏఈలు నరసింహ, నర్మద పాల్గొన్నారు.

మంత్రుల పర్యటన ఏర్పాట్లు పరిశీలన

రాష్ట్ర మంత్రులు కె.తారక రామారావు, కొప్పుల ఈశ్వర్ గురువారం సిరిసిల్లలో పర్యటించనుండగా.. ఏర్పాట్లను కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్ బుధవారం సాయంత్రం పరిశీలించారు. తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల వ్యవసాయ కళాశాల, పద్మనాయక కల్యాణ మండపంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో ఆర్థిక సాయం పంపిణీకి వచ్చే లబ్ధిదారులకు సీటింగ్ అరేంజ్‌మెంట్లను పరిశీలించారు. అదనపు కలెక్టర్లు బి.సత్యప్రసాద్, ఎన్.ఖీమ్యానాయక్, డీఆర్వో టి.శ్రీనివాస్‌రావు, వేములవాడ ఆర్డీవో పి.పవన్‌కుమార్, జెడ్పీ సీఈవో బి.గౌతమ్‌రెడ్డి, డీఎస్‌వో జితేందర్‌రెడ్డి, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ జితేంద్రప్రసాద్, తహసీల్దార్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల పోరుబాట

- నేటి నుంచి జీపీ కార్మికుల నిరవధిక సమ్మె
- జిల్లాలో 1,278 మంది కార్మికులు
- కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్



ఆందోళన చేస్తున్న కార్మికులు(ఫైల్)

చందుర్తి(వేములవాడ): గ్రామపంచాయతీల్లో పని చేస్తున్న కార్మికులు తమ డిమాండ్ల సాధన కోసం గురువారం నుంచి సమ్మెబాట పడుతున్నారు. కనీస వేతనం అమలు చేయాలని, ఉద్యోగ భద్రత, బీమా సౌకర్యంతోపాటు పలు డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న 1278 మంది పంచాయతీ కార్మికులు సమ్మెబాట పడుతున్నారు. వీరి సమ్మెతో గ్రామాల్లో పారిశుధ్య పనులతోపాటు పలు రకాల పనులు నిలిచిపోనున్నాయి.

255 గ్రామాల్లో..

జిల్లా వ్యాప్తంగా ఉన్న 255 గ్రామాల్లో 1,278 మంది పంచాయతీ కార్మికులు పనిచేస్తున్నారు. గతంలో సమ్మె చేసిన సమయంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతున్నారు. నెల రోజుల వ్యవధిలో డిమాండ్లు నెరవేర్చకపోతే సమ్మె చేస్తామనని జూన్ 6న తలపెట్టిన సమ్మెను జూలై 6కు వాయిదా వేసుకున్నారు. నెల రోజులు గడిచినా ప్రభుత్వం దిగి రాకపోవడంతో గురువారం నుంచి సమ్మెకు సిద్ధమవుతున్నట్లు ప్రకటించారు.

మల్టీపర్పస్‌తో అన్ని పనులు

మూడేళ్ల క్రితం జీవో 51 తీసుకొచ్చి రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ కార్మికులతో అన్ని రకాల పనులు చేయిస్తోంది. మల్టీపర్పస్ కార్మికుల్లో సఫాయి, ఎలక్ట్రీషియన్, వాటర్‌మెన్, ట్రాక్టర్ డ్రైవర్ ఉన్నారు. 500 మంది జనాభాకు ఒక్క కార్మికుడికి రూ.8,500 చొప్పున వేతనం చెల్లిస్తోంది. నైపుణ్యం లేకున్నా అన్ని రకాల పనులు చేయిస్తున్నారు. కాగా ప్రభుత్వం వారి డిమాండ్లను తుంగలో తొక్కి మే డే సందర్భంగా రూ.వెయ్యి పెంచుతూ జీవోను విడుదల చేసింది. పెంచిన వేతనం కూడా కూడా గ్రామపంచాయతీల నుంచే తీసుకోవాలని స్పష్టం చేసింది. ఆర్థిక సంఘం, ఎస్ఎఫ్‌సీ నిధులు రాక మూడు నెలలకోసారి సిబ్బందికి వేతనాలు చెల్లిస్తున్న తరుణంలో మరో రూ.వెయ్యి పెంచడంపై పాలకవర్గాలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

హామీలు నిలబెట్టుకోవాలి



2018లో చేపట్టిన నిరవధిక సమ్మెకాలంలో సీఎం కేసీఆర్ పంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి. ఏళ్ల తరబడి వెట్టిచాకిరీ చేస్తూ దుర్భర జీవితాలు గడుపుతున్నాం. కనీసం వేతనం కావాలంటే రూ.వెయ్యి పెంచి చేతులు దులుపుకుంది. గత నెలలో చేపట్టాల్సిన నిరవధిక సమ్మెను ప్రభుత్వం స్పందిస్తుందనే ఆశతోనే నెల రోజులు వాయిదా వేసుకున్నాం. నెల గడిచినా ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో గురువారం నుంచి జిల్లా వ్యాప్తంగా సమ్మె చేపడుతున్నాం.

– మల్యాల నర్సయ్య, పంచాయతీ కార్మిక సంఘం జిల్లా నాయకుడు

కార్మికుల డిమాండ్లు ఇవీ..

- కారోబార్లు, బిల్‌కలెక్టర్లను అసిస్టెంట్ పంచాయతీ కార్యదర్శిగా ప్రత్యేక హోదా కల్పించాలి.
- కనీస వేతన చట్టం కింద రూ.21,500 చెల్లించాలి.
- జీవో 51 ప్రకారం కేటగిరీల వారీగా హోదా కల్పించాలి.
- ఉద్యోగ భద్రత, బీమా సౌకర్యం కల్పించాలి.
- నేరుగా ఖాతాల్లోనే వేతనాలు జమకావాలి.
- పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలి.

క్లుప్తంగా

బీపీఈడీలో ప్రతిభ చూపిన విద్యార్థినికి సన్మానం



రమ్యను సన్మానిస్తున్న సభ్యులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): బీపీఈడీలో రాష్ట్రస్థాయిలో 36వ ర్యాంక్ సాధించిన గొల్లపల్లికి చెందిన పెద్దూరి రమ్యను బుధవారం తెలంగాణ వివేకరచయితల సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. ఆ సంఘం అధ్యక్షుడు వాసరవేణి పర్శరాములు గొల్లపల్లికి చెందిన రమ్య వాలీబాల్ క్రీడలో జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చిందన్నారు. జాతీయస్థాయి పోటీలలో 3 సార్లు, రాష్ట్ర స్థాయి పోటీలలో 16 సార్లు పాల్గొందని తెలిపారు. జిల్లా కార్యదర్శి దుంపెన రమేశ్, సభ్యులు అజయ్, జయవర్ధన్, వెంకన్న, సంజీవ్, అనిల్ పాల్గొన్నారు.

విద్యార్థులపై నిర్లక్ష్యం



మాట్లాడుతున్న చొక్కాల రాము

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల మున్సిపల్ పరిధి చిన్న బోనాల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులపై ప్రిన్సిపాల్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వైఎస్ఆర్టీపీ జిల్లా అధ్యక్షుడు చొక్కాల రాము ఆరోపించారు. సిరిసిల్లలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. బడుగు, బలహీనవర్గాల పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తే సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. సరైన సిబ్బంది లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మౌలిక వసతులు లేవని, యూనిఫామ్స్, దుప్పట్లు ఇవ్వడంలో జాప్యం చేస్తున్నారన్నారు. వంగరి అనిల్, మేన లక్ష్మణ్, పూర్మాణి కరుణాకర్, జింక ఎల్లయ్య, ప్రశాంత్, శ్రీకాంత్, ఆనంద్, లక్ష్మణ్, అనిల్ ఉన్నారు.

వక్ఫ్‌బోర్డు స్థలాల జాయింట్ సర్వేకు సహకరించాలి

వేములవాడఅర్బన్: వేములవాడ పట్టణంలోని వక్ఫ్‌బోర్డు స్థలాల జాయింట్ సర్వేకు సహకరించాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లా వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ నజీమొద్దీన్ కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ రజితకు వినతిపత్రం అందజేశారు. నజీమొద్దీన్ మాట్లాడుతూ పట్టణంలోని చెక్కపల్లిరోడ్‌లో గల సర్వేనంబర్ 107, 1348, 1349, 974, 289 సర్వేనంబర్లలోని వక్ఫ్‌బోర్డు స్థలాలపై అధికారులకు వివరించారు. పట్టణ ముస్లిం కమిటీ ప్రధాన కార్యదర్శి మహ్మద్ వలీ ఉన్నారు.

స్కూల్ టాపర్ల వివరాలతో బోర్డులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని బొప్పాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఇప్పటి వరకు చదివి ఆయా విద్యాసంవత్సరాలలో టాపర్లుగా నిలిచిన విద్యార్థుల వివరాలతో డిస్‌ప్లే బోర్డులను ఏర్పాటు చేశారు. లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆ పాఠశాల 1987–88, 1988–89 పదోతరగతి పూర్వవిద్యార్థుల సహకారంతో ఏర్పాటు చేశారు. పదోతరగతిలో టాపర్లు, ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన విద్యార్థుల తల్లిదండ్రులను సన్మానించారు. సర్పంచ్ కొండాపురం బాల్‌రెడ్డి, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రామచంద్రం, ట్రెజరర్ మల్లారెడ్డి, క్లబ్ బాధ్యులు నంది కిషన్, బోయిని మహదేవ్, ముత్యాల కిష్టారెడ్డి, హెచ్ఎం శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

క్రీడాస్థలి.. నిర్లక్ష్యానికి బలి

- పనికిరాకుండా పోతున్న ప్రభుత్వ కళాశాల మైదానం
- అధికారుల నిర్లక్ష్యం.. ఆటగాళ్లకు శాపం
- గ్రౌండ్ అభివృద్ధికి వీడని గ్రహణం



మైదానంలో కొనసాగుతున్న పనులు

సిరిసిల్లటౌన్: ఏడు దశాబ్దాలుగా క్రీడలకు కేంద్ర బిందువుగా నిలిచిన మైదానం పాలకుల నిర్లక్ష్యానికి బలవుతుంది. పాత తాలూకా పరిధిలోనే జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులకు పురుడు పోసిన మైదానం అధికారుల నిర్లక్ష్యానికి వట్టిపోతుంది. ఎందరో క్రీడాకారులను పరిచయం చేసిన సదరు మైదానం నేడు కళ తప్పింది. ఏళ్లగా క్రీడాస్థలిపై అధికారులు, ప్రజాప్రతినిధులు చూపుతున్న ఉదాసీన వైఖరికి నిదర్శనం.

గతమెంతో ఘనకీర్తి

1954లో అప్పటి విద్యాశాఖ మంత్రి జీకే ఎగ్బోటి చేతుల మీదుగా సిరిసిల్లలో ప్రభుత్వ హైస్కూల్ ఏర్పడింది. సుమారు తొమ్మిది ఎకరాల్లో పాఠశాలను ఏర్పాటు చేశారు. 1980 తర్వాత పాత తాలూకాగా ఉంటున్న సిరిసిల్ల పట్టణానికి ప్రభుత్వం జూనియర్ కళాశాలను మంజూరు చేయగా.. అప్పటి నుంచి హైస్కూలు, కళాశాలలు రెండు దీని పరిధిలోనే ఉంటున్నాయి. ఎందరో క్రీడాకారులను పరిచయం చేసిన ఈ మైదానం నేటి పాలకులు, అధికారుల పట్టింపులేమికి నిదర్శనంగా నిలుస్తోంది.

చాంపియన్స్‌ను అందించిన మైదానం

ముప్పై ఐదేళ్ల క్రితం సిరిసిల్ల క్రీడలకు ఖిల్లాగా వెలుగొందింది. సిరిసిల్ల కేంద్రంగా కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్ క్రీడలకు ప్రోత్సాహం ఉండేది. క్రీడల శిక్షణ, పోటీలు నిరాటంకంగా సాగేవి. క్రీడాపోటీలకు సిరిసిల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం అందుబాటులో ఉండడంతో ఏటా తాలూకా, జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలు నిర్వహించేవారు.

నిధులున్నా..

క్రీడాశిక్షణార్థులతో రోజంతా కిటకిటలాడేది. తర్వాత జరిగిన పరిణామాలతో మైదానం దెబ్బతింది. వివిధ ప్రభుత్వ, ప్రైవేటు కార్యక్రమాలకు అడ్డాగా మారడంతో మైదానం ప్రత్యేకత పాడైంది. మంత్రి కేటీఆర్ చొరవతో గ్రౌండు అభివృద్ధికి రూ.2 కోట్లు విడుదలయ్యాయి. కరీంనగర్‌కు చెందిన ఓ కాంట్రాక్టు కంపెనీ పనులు చేపట్టేందుకు తీసుకోగా మందకొడిగా సాగుతున్నాయి. ఏడాదిన్నరగా పనులు సాగుతుండడంతో క్రీడాకారులు, నిత్యం గ్రౌండుకు వచ్చే వాకర్స్ ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపాటి వర్షానికి గ్రౌండు చిత్తడవుతుంది. వర్షం పడిన మూడు నాలుగు రోజులు మైదానంలో అడుగుపెట్టే పరిస్థితి ఉండదు.

మైదానంలో వసతులు.. కష్టాలు

సిరిసిల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో పనులు పూర్తయితే డార్మిటరీ హాలు, మోడ్రన్ టాయిలెట్స్, రెండు గ్యాలరీలు, వాలీబాల్, కబడ్డీ కోర్టులు, క్రికెట్ గ్రౌండు, రన్నింగ్ ట్రాక్, ప్రాక్టీస్ నెట్, ఓపెన్‌జిమ్, హైమాస్ట్ లైట్లు, రెండు ప్రధాన ద్వారాలు నిర్మితమవుతాయి. అభివృద్ధి పనుల కోసం కోర్టులు, ఓపెన్‌జిమ్‌ను తొలగించడంతో క్రీడాకారులకు స్థలం లేకుండా పోయింది. రన్నింగ్‌ట్రాక్ పనులు పూర్తికాలేవు.

నెల రోజుల్లో పనులు పూర్తి



కళాశాల మైదానం సకల వసతులతో రూపుదిద్దకుంటుంది. మరో నెల రోజుల్లో పనులు పూర్తవుతాయి. ఈమేరకు కాంట్రాక్టర్‌కు ఆదేశాలిచ్చాం. ఇప్పటికే 75 శాతం పనులు పూర్తయ్యాయి. ఆర్నెళ్లలోపు గడువు నిర్దేశంతో పనులు అప్పగించాం. నిర్ణీత సమయంలోపు పూర్తి చేయిస్తాం.

– వెల్దండి సమ్మయ్య, సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్

జెడ్పీ చైర్‌పర్సన్‌గా నాలుగేళ్లు

- కేక్ కట్ చేసిన అరుణ



కేక్ కట్ చేసిన జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ

సిరిసిల్ల: జెడ్పీ చైర్‌పర్సన్‌గా న్యాలకొండ అరుణ బాధ్యతలు స్వీకరించి బుధవారం నాటికి నాలుగేళ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా జెడ్పీ ఆఫీస్‌లో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. జెడ్పీ సీఈవో బి.గౌతమ్‌రెడ్డి, వైస్‌చైర్మన్ సిద్ధం వేణు, జెడ్పీటీసీలు ఏశ వాణి, గుగులోత్ కళావతి, గట్ల మీనయ్య, గుండం నర్సయ్య, నాగం కుమార్, కోనరావుపేట సింగిల్‌విండో చైర్మన్ బండ నర్సయ్యయాదవ్, జిల్లా సర్పంచుల ఫోరమ్ జిల్లా కార్యదర్శి మంతెన సంతోష్, వేములవాడ మండల సర్పంచుల ఫోరమ్ అధ్యక్షుడు ఏశ తిరుపతియాదవ్, బీఆర్ఎస్ నాయకులు న్యాలకొండ రాఘవరెడ్డి, నాగరాజు, జెడ్పీ ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అపోలో రీచ్‌లో అరుదైన శస్త్రచికిత్స



మాట్లాడుతున్న వైద్యులు

కరీంనగర్‌టౌన్: అపోలో రీచ్ ఆస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్స చేసినట్లు హాస్పిటల్ కార్డియాలజిస్టు డాక్టర్ అనిల్‌కుమార్ ముల్బార్, న్యూరో వైద్యుడు సంజయ్ కుమార్ తెలిపారు. బుధవారం దవాఖానాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కరీంనగర్‌కు చెందిన కాశెట్టి శ్రీనివాస్, అంజలి దంపతుల కూతురు సాయిశ్రీ పాఠశాలలో అకస్మాత్తుగా కిందపడిపోవడంతో కుడికాలు, కుడి చేయి చచ్చుపడిపోయి, మాట కూడా రాలేదు. తల్లిదండ్రులు దగ్గరలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యుల సూచన మేరకు అపోలో రీచ్ ఆస్పత్రిలో చేర్పించారు. సాయిశ్రీని పరీక్షించిన డాక్టర్లు మెదడులో రక్తం గడ్డకట్టడం వల్ల కాలు, చేయి పడిపోయాయని గుర్తించారు. అత్యాధునిక ఫిలిప్స్ అజ్యూరియన్ వంటి సాంకేతికతతో సెరబ్రల్ యాంజియోగ్రఫి, మెకానికల్ తంబెక్టమి అనే ప్రత్యేక పద్ధతిలో ఆపరేషన్ చేశారు. అయితే ఇంత చిన్న వయసులో రక్తం గడ్డకట్టడం ఏమిటన్న సందేహంతో పాపకు మరిన్ని పరీక్షలు నిర్వహించగా గుండె లోపల కణితి ఉన్నట్లు గుర్తించారు. దీన్ని వైద్య భాషలో ఎలమిట్బోమా అంటారని, ఇది అరుదుగా వస్తుందని తెలిపారు. చిన్నారికి వెంటనే ఆపరేషన్ చేసి, కణితిని తొలగించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం పాప పూర్తిగా కోలుకుందన్నారు. సమావేశంలో ఆస్పత్రి అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ నాగసతీశ్, వైద్యులు, సిబ్బంది, చిన్నారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అవగాహన లేకనే మరణాలు



మందులు పంపిణీ చేస్తున్న చల్మెడ లక్ష్మీ నరసింహారావు

రుద్రంగి(వేములవాడ): అవగాహన లేకనే క్యాన్సర్ మరణాలు సంభవిస్తున్నాయని చల్మెడ మెడికల్ కాలేజీ చైర్మన్ చల్మెడ లక్ష్మీనరసింహారావు పేర్కొన్నారు. గ్రామీణులకు వివిధ రకాల క్యాన్సర్ వ్యాధులపై అవగాహన కల్పించేందుకు వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రుద్రంగిలోని రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో బుధవారం చల్మెడ మెడికల్ కాలేజీ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్యశిబిరంలో సుమారు 400 మందికి ఉచిత వైద్యపరీక్షలు చేసి అవసరమున్న వారికి మందులు పంపిణీ చేశారు. సమస్య తీవ్రంగా ఉన్న వారికి కరీంనగర్‌లోని చల్మెడ మెడికల్ కాలేజీలో ఉచితంగా చికిత్స అందజేస్తామని తెలిపారు. నాయకులు మాడిశెట్టి ఆనందం, కేసిరెడ్డి నర్సారెడ్డి, ఉప్పులూటి గణేశ్, మెడికల్ కాలేజీ వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుల సంరక్షణ కేంద్రానికి మహిళ తరలింపు



సంరక్షణ కేంద్రంలో మహిళ

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలకేంద్రంలోని పాత బస్టాండ్ పరిసరాల్లో రెండు రోజులుగా అనుమానాస్పదంగా తిరుగుతున్న గుర్తు తెలియని మహిళను వృద్ధుల సంరక్షణ కేంద్రానికి తరలించారు. సోషల్‌మీడియాలో వైరల్ అయిన పోస్టుకు స్పందించిన జిల్లా వెల్ఫేర్ అధికారి లక్ష్మీరాజం వసతి కల్పించాలని ఎల్లారెడ్డిపేటలోని వృద్ధుల సంరక్షణ కేంద్రం కోఆర్డినేటర్ మమతను ఆదేశించారు. ఆ మహిళను 108 వాహనంలో తరలించి సంరక్షణ కేంద్రంలో ఉంచారు. వీర్నపల్లి మండలం మద్దిమల్లకు చెందిన బానోత్ కమలగా గుర్తించామని కో–ఆర్డినేటర్ మమత తెలిపారు.

‘సెస్’ చందుర్తి సీనియర్ అసిస్టెంట్ సస్పెన్షన్



సీనియర్ అసిస్టెంటు కార్తీక్

సిరిసిల్ల/చందుర్తి(వేములవాడ): సహకార విద్యుత్ సరఫరా సంఘం(సెస్)లో చందుర్తి మండలంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎం.కార్తీక్‌ను సస్పెండ్ చేసినట్లు సెస్ ఎండీ రామకృష్ణ బుధవారం ప్రకటించారు. మండలంలో వ్యవసాయ విద్యుత్ లైన్‌ల మంజూరులో తప్పుడు బిల్లులను సృష్టించి ‘సెస్’కు రావాల్సిన డబ్బులను దుర్వినియోగం చేయడంతో సస్పెండ్ చేసినట్లు పేర్కొన్నారు. చందుర్తిలోని ఓ రైతు వద్ద నోపోల్ సాంక్షన్ కింద తీసుకున్న డబ్బులకు ఫేక్ రశీదు ఇచ్చినట్లు గుర్తించిన సెస్ అధికారులు బుధవారం విచారణ చేపట్టి సస్పెండ్ చేసినట్లు ప్రకటించారు. ఇలాంటి తప్పుడు రశీదులు మరో పదికి పైగా ఉన్నాయని చందుర్తి మండల కేంద్ర వాసులు చర్చించుకుంటున్నారు.

మార్చాల్సిందిపోయి.. సస్పెండ్ చేస్తారా?

- టీపీటీఎఫ్ అధ్యక్షుడు భూపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న భూపాల్‌రెడ్డి

సిరిసిల్లఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో పరిశుభ్రత కోసం ఉపాధ్యాయులు పనిచేసి దానిని ప్రభుత్వానికి, అధికారులకు తెలిపేందుకు ప్రయత్నిస్తే సస్పెండ్ చేయడం గర్హనీయమని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దోర్నాల భూపాల్‌రెడ్డి పేర్కొన్నారు. సిరిసిల్లలో బుధవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కరీంనగర్ జిల్లా విద్యాశాఖ ఆధీనంలోని ఓ ఉపాధ్యాయుడు తన పాఠశాలలో సర్వీస్ పర్సన్ లేకపోవడంతో పరిసరాలను పరిశుభ్రం చేశాడన్నారు. దాన్ని మరో ఉపాధ్యాయుడు సామాజిక మాధ్యమాల్లో పెట్టి అందరి పరిస్థితి ఇదేనని తెలిపేందుకు ప్రయత్నిస్తే క్రమశిక్షణ చర్యలు అంటూ సస్పెండ్ చేయడం సరికాదన్నారు. మారాల్సింది పని విధానం అని, ప్రతి పాఠశాలకు విధిగా సర్వీస్ పర్సన్స్‌ను అందించాల్సిన బాధ్యతను అధికారులు, పాలకులు గుర్తించాలని కోరారు.

సామూహిక వనభోజనం



వనభోజనాలలో యాదవులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట పంచాయతీ పరిధి కిషన్‌దాస్‌పేటలో శ్రీకృష్ణయాదవ సంఘం ఆధ్వర్యంలో యాదవులు బుధవారం సామూహిక వనభోజనాలకు తరలివెళ్లారు. గ్రామదేవతలకు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఉపసర్పంచ్ ఒగ్గు రజిత, యాదవ సంఘం అధ్యక్షుడు బాల్‌రాజ్, సభ్యులు వెంకట్, శ్రీనివాస్, మహేశ్, కుమార్, రాజు, లింబాద్రి, దేవయ్య, మనోజ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ఉద్యోగులపై కేసు

వేములవాడ: రాజన్న ఆలయ పర్యవేక్షకుడు నాగుల మహేశ్, జూనియర్ అసిస్టెంట్ శివపై కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ వెంకటేశ్ బుధవారం తెలిపారు. ఎస్సీ, ఎస్టీ కేసు విచారణలో ఉండగా వారిని బెదిరించి కేసును పక్కదారి పట్టించేందుకు ప్రయత్నించిన ఇద్దరిపై కేసు నమోదైనట్లు తెలిపారు.

ఏటీ యాదవ్‌పై కేసు

వేములవాడ: వేములవాడ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని శాభాష్‌పల్లి సర్పంచ్ పండుగ ప్రదీప్‌ను కులం పేరుతో దూషించిన కేసులో ఏటీ యాదవ్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ నాగేంద్రచారి బుధవారం తెలిపారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందిస్తున్న దాతలు

కోనరావుపేట(వేములవాడ): కోనరావుపేటకు చెందిన బొల్లె శ్రీనివాస్ కుటుంబానికి ఎన్నారై పాలసీ కోనరావుపేట గల్ఫ్‌మిత్రులు రూ.36,670 ఆర్థికసాయం బుధవారం అందజేశారు. గ్రామానికి చెందిన శ్రీనివాస్ ఇటీవల గల్ఫ్‌నకు వెళ్లి అక్కడే గుండెపోటుతో మృతిచెందాడు. కోనరావుపేట గల్ఫ్ మిత్రుల ఆధ్వర్యంలో ఆర్థికసాయం అందించారు. మార్గం అశోక్, దూర్ల రాజేశం, బొల్లె ప్రశాంత్, మాందాల ప్రశాంత్, బోయిని శ్రీనివాస్, గడిపెల్లి మహేశ్, గొట్టె భూపతి, శంకర్, స్వామి పాల్గొన్నారు.

ఉపాధి కోసం గల్ఫ్‌కు.. శవపేటికలో ఇంటికి

- కట్టలింగంపేటలో విషాదం



మల్లయ్య (ఫైల్)

చందుర్తి(వేములవాడ): జీవనోపాధి కోసం గల్ఫ్‌కు వెళ్లిన వ్యక్తి అనారోగ్యంతో ప్రాణాలు వదిలిన సంఘటన మండలంలోని కట్టలింగంపేటలో విషాదం నింపింది. బుధవారం మృతదేహం స్వగ్రామానికి చేరుకుంది. కట్టలింగంపేటకు చెందిన ఆది మల్లయ్య(47) పన్నెండేళ్లుగా దుబాయ్ వెళ్లి, వస్తున్నాడు. జూన్ 14న కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతుండగా అక్కడ ఆస్పత్రిలో చేర్పించగా.. 28న మృతిచెందాడు. అప్పటి నుంచి కుటుంబ సభ్యులకు తెలపకుండా గోప్యంగా ఉంచారు. శవాన్ని మంగళవారం ఇంటికి పంపించే సమయంలో కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుని భార్య రేణుక, కూతురు అంజలి, కుమారుడు సిద్దు బవేశ్ ఉన్నారు. ఆది మల్లయ్య అంతిమ యాత్రలో డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు చల్మెడ లక్ష్మీనర్సింహరావు, జెడ్పీటీసీ నాగం కుమార్, లింగంపేట ఎంపీటీసీ పెగ్గర్ల రమేశ్, మాజీ సర్పంచ్ గంద్ర లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

గుండెపోటుతో డిప్యూటీ తహసీల్దార్ మృతి

- ముథోల్‌లో సంఘటన.. సిరిసిల్లలో విషాదం



ఆసిఫ్(ఫైల్)

సిరిసిల్లటౌన్: ముథోల్ డిప్యూటీ తహసీల్దార్, సిరిసిల్లకు చెందిన మహ్మద్ అబ్దుల్ ఆసిఫ్(52) గుండెపోటుతో మరణించాడు. బంధువులు తెలిపిన వివరాలు. ముథోల్‌లో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఆసిఫ్ సిరిసిల్లలోని గీతానగర్ వాసి. ముథోల్‌లో అద్దె ఇంట్లో ఉంటూ అక్కడే విధులు నిర్వరిస్తున్నాడు. మంగళవారం విధులు ముగించుకుని గదికి వెళ్లిన ఆసిఫ్ బుధవారం ఆఫీస్‌కు రాలేదు. తోటి సిబ్బంది ఫోన్ చేసినా ఎత్తకపోవడంతో గదికి వెళ్లి చూశారు. ఎంత పిలిచినా తలుపులు తెరువకపోవడంతో పగులగొట్టి చూడగా చనిపోయి కనిపించాడు. విషయం తెలుసుకున్న అక్కడి కలెక్టర్ వరుణ్‌రెడ్డి ఆసిఫ్ మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మృతుడికి భార్య షాహెద్‌బేగం, పెళ్లయిన కుమార్తె, ఇద్దరు కొడుకులు సల్మాన్, సోహెల్ ఉన్నారు.

చికిత్స పొందుతూ గీతకార్మికుడు..



అంజయ్య (ఫైల్)

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని జిల్లెల్ల గ్రామానికి చెందిన గీతకార్మికుడు కందుకూరు అంజయ్య(49) చికిత్స పొందుతూ మృతిచెందాడు. గత నెల 25న తాటి చెట్టు పైనుంచి కిందపడి తీవ్రంగా గాయపడగా.. కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మరణించాడు. మృతునికి భార్య సులోచన, ఒక కూతురు ఉన్నారు. తంగళ్లపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మూలకుపడ్డ సీటీస్కాన్



వేములవాడ ఏరియా ఆసుపత్రి



ఆసుపత్రిలో సీటీస్కాన్

- రోగులకు అందని సేవలు
- పట్టించుకోని అధికారులు
- నిరుపయోగంగా మిషిన్

వేములవాడఅర్బన్: గ్రామీణులకు కార్పొరేట్ స్థాయి వైద్యం ఉచితంగా అందించాలన్న ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. వేములవాడ ఏరియా ఆస్పత్రిలో కోట్ల రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన సీటీస్కాన్ మిషిన్ నిరుపయోగంగా మారింది. రేడియాలజిస్ట్ రావడం లేదని ఇటీవల సీటీస్కాన్ సేవలను నిలిపివేశారు. దీంతో ప్రభుత్వ ఆస్పత్రికి వస్తున్న రోగులు ప్రైవేట్‌లో స్కానింగ్ చేయించుకుంటుండడం ఆర్థికంగా భారమవుతుంది.

2021లో ఆస్పత్రి ప్రారంభం

వేములవాడలో ఏరియా ఆస్పత్రిని 2021, మే 28న ప్రారంభించారు. ఈ ఆస్పత్రి ఏర్పాటుతో వేములవాడ సమీప గ్రామీణులకు పెద్దాస్పత్రి సేవలు ఉచితంగా అందుబాటులోకి వచ్చాయి. మరిన్ని సౌకర్యాలు అందించేందుకు వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు, రాష్ట్ర మంత్రి కేటీఆర్ సహకారంతో అధునాతనమైన పరికరాలను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగానే సీటీస్కాన్ మిషిన్‌ను ప్రారంభించారు. కొద్ది నెలలు మాత్రమే సేవలు అందించగా.. ఇప్పుడు నిరుపయోగంగా మారింది.

పేరుకే సీటీస్కాన్

వేములవాడ ఏరియా ఆస్పత్రిలో వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు, మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా 2022 మార్చిలో రూ.2 కోట్లతో సీటీస్కాన్‌ను ప్రారంభించారు. ప్రారంభించిన మూడు నెలలు నిరుపయోగంగా ఉంది. రేడియాజిస్ట్ పోస్టు ఖాళీగా ఉందని సీటీస్కాన్ సేవలను ప్రారంభించలేదు. దీంతో వేములవాడ ఏరియా ఆస్పత్రికి వచ్చే రోగులు ప్రైవేట్‌లో సీటీ స్కానింగ్ చేయించుకొని ఆస్పత్రికి వస్తున్నారు. ఇది రోగులకు ఆర్థికంగా భారంగా మారింది. ఈ విషయాన్ని సాక్షిలో 2022 మే నెలలో కథనం ప్రచురితమవడంతో కలెక్టర్ స్పందించారు. రేడియాలజిస్ట్‌ను నియమించారు. అనంతరం సీటీ స్కాన్ సేవలు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. తర్వాత 9 నెలలపాటు సీటీస్కాన్ సేవలు అందుబాటులో ఉన్నాయి. ఇటీవల నాలుగు నెలలుగా రేడియోలజిస్ట్ రాకపోవడంతో మళ్లీ సీటీ స్కాన్ సేవలు నిలిచిపోయాయి. మళ్లీ రోగులు ప్రైవేట్‌లో సీటీస్కానింగ్ చేయించుకోవడం ఆర్థికంగా భారంగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రేడియాలజిస్ట్ పోస్టును శాశ్వతంగా భర్తీ చేయాలని కోరుతున్నారు.

వారంలోగా సేవలందిస్తాం



వేములవాడ ఏరియా ఆస్పత్రిలో సీటీస్కాన్ ఆపరేటర్ రేడియాలజిస్ట్ వెళ్లిపోవడంతో పోస్ట్ ఖాళీగా మారింది. మరొకరిని నియమించాలని ఉన్నతాధికారులకు నివేదించాం. వారం రోజుల్లో ఆ పోస్టును నియమించి, సీటీస్కాన్ సేవలను అందుబాటులోకి తెస్తాం. – డాక్టర్ మహేశ్‌రావు, వేములవాడ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్